తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్

మంగళవారం
19 మే 2026

పేజీలు - 8








# ప్రకృతి విపత్తులపై అప్రమత్తత

- వరంగల్‌లో ఉత్కంఠ రేపిన రెడ్ అలెర్ట్ మాక్ డ్రిల్
- చెరువులో చిక్కుకున్న వారిని క్షణాల్లో రక్షించిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- ప్రత్యక్ష విపత్తును తలపించిన సహాయక చర్యలు
- సహాయక చర్యలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ బ్యూరో , మే 18 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలో సోమవారం నిర్వహించిన ప్రకృతి విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్ ప్రజల్లో ఉత్కంఠ రేపింది. నిజంగా వరద విపత్తు సంభవించినట్టే అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేపట్టిన సహాయక చర్యలు కళ్లకు కట్టినట్లు కనిపించాయి.మధ్య కోట గుండు చెరువు ప్రాంతంలోని యాదవవాడలో రెడ్ అలెర్ట్ ప్రకటించడంతో ఒక్కసారిగా అప్రమత్తమైన అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది.ఈ ప్రక్రియవంత ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 వరకు జరిగింది. ఈ కార్యక్రమం వలన ప్రజలలో మంచి అవగాహన కలిగించుటకు ఈ మాక్ డ్రిల్ ఎంతగానో ఉపయోగపడిందని ప్రజలకు బరోసా కల్పించారు. ఈ మాక్ డ్రిల్ లోవాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో చేపట్టిన ఈ మాక్ డ్రిల్‌లో పోలీస్, రెవెన్యూ, ఫైర్, వైద్య ఆరోగ్య, పశు సంవర్ధక శాఖలతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేశాయి. ప్రమాద సమయం లో క్షణం ఆలస్యం కూడా ప్రాణనష్టానికి దారితీస్తుందనే పరిస్థితిని ప్రత్యక్షంగా ప్రజలకు చూపించడం లో ప్రజల్లో అవేర్నెస్ కల్పించడం జరిగింది.వరంగల్ ఏకశిలా పార్కు చెరువులో ఇద్దరు వ్యక్తులు నీటిలో కొట్టుకుపోతుండగా, మరో ఇద్దరు చెరువు మధ్యలోని బండరాళ్లపై ప్రాణభయంతో సహాయం కోసం అరుస్తున్న దృశ్యాలు అక్కడ ఉన్న వారిని కలచివేశాయి.సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు హుటాహుటిన బోట్లతో చెరువులోకి దూసుకెళ్లి, ఉధృత నీటిని చీల్చుకుంటూ బాధితులను రక్షించాయి. ఈ దృశ్యాలు చూస్తున్న ప్రజలు కాసేపు ఇది మాక్ డ్రిల్ అన్న విషయాన్నే మరిచిపోయారు. అదే సమయంలో వరద ప్రవాహంలో కొట్టుకుపోతున్న గొర్రెలు, ఆవులను కూడా ప్రత్యేక బృందాలు సాహసోపేతంగా రక్షించుటలో ఎన్ డి ఆర్ ఎఫ్ బృందాల తీరు ను ప్రజలు అభినందించారు. నీటిలో నుంచి బయటకు తీసిన పశువులను వెంటనే పశువైద్య సిబ్బంది చికిత్స కోసం తరలించారు.రక్షించిన బాధితుల్లో ఒకరు అపస్మారక స్థితిలో ఉన్నట్లు చూపించగా, వైద్య సిబ్బంది అక్కడికక్కడే సీపీఆర్ నిర్వహించి ప్రాణాలు కాపాడే విధానాన్ని ప్రదర్శించారు. అనంతరం 108 అంబులెన్స్‌లో బాధితుడిని ఎంజీఎం ఆసుపత్రికి తరలించడం ద్వారా అత్యవసర వైద్య సేవల స్పందనను చూపించారు. ప్రమాదం సంభవించినప్పుడు మిగతా 9లో..

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

- రైస్ మిల్లును, రికార్డులను ఆకస్మిక తనిఖీ
- అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ఆదేశాలు

**కాటారం, మే 18 ( జనం సాక్షి):** ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సమర్ధవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ఆదేశించారు. సోమవారం కాటారం మండలంలోని అన్నపూర్ణ రైస్ మిల్లు ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లులో ధాన్యం దిగుమతులు, నిల్వలు, నాణ్యత ప్రమాణాలు, ప్రభుత్వ మార్గదర్శకాల అమలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మిల్లులో నిల్వ ఉంచిన ధాన్యం స్టాక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తక్షణ చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని మిల్లర్లకు సూచించారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే అన్‌లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, వాహనాలు ఎక్కువసేపు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అక్నాలెడ్జ్‌మెంట్‌లను వెంటనే క్లియర్ చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను మిల్లర్లు ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ధాన్యం నిల్వ, రవాణా, రికార్డు నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోరాదని హెచ్చరించారు. అదేవిధంగా జిల్లాలో ట్యాబ్ ఎంట్రీల ప్రక్రియను ప్రతిరోజూ క్రమం తప్పకుండా నిర్వహించాలని జిల్లా సహకార అధికారిని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వంద శాతం ట్యాబ్ ఎంట్రీలు 24 గంటల లోపు నమోదు అయ్యేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ట్యాబ్ ఎంట్రీలను మిగతా 9లో..

# ఉత్సాహంగా మారథాన్ రన్



**నిర్మల్ మే 18 (జనంసాక్షి) :** ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని నిజం చేస్తూ నిర్మల్ పట్టణంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక యువజనోత్సవాల్లో భాగంగా ఉదయం మారథాన్ రన్ నిర్వహించారు. స్థానిక శివాజీ చౌక్ నుండి ఎన్టిఆర్ మినీస్టేడియం వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తితో పాటు ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు , ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడం, యువతలో క్రీడాస్ఫూర్తిని అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. మారథాన్ రన్ శారీరకంగా, మానసికంగా మనిషికి అనేక ప్రయోజనాలు అందిస్తుందని, రోజువారీ వ్యాయామం, సమయపాలన వంటి మంచి అలవాట్లు పెరుగుతాయన్నారు. ఆరోగ్యం, పర్యావరణం, సామాజిక సేవ వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం కలుగ జేసేందుకు మారథాన్ రన్ తీసుకుందని తెలిపారు.

# భర్త చేతిలో భార్య హత్య

- తల్లి మృతితో అనాథలైన ఇద్దరు చిన్నారులు
- సుత్తితో దాడి చేసినట్లు సమాచారం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



వార్త మెయిన్ 3లో

# గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరికి 10 ఏళ్ల జైలుశిక్ష

- చెరొక 100,000 జరిమానా
- మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ములుగు పోలీసుల కఠిన చర్య....

వార్త మెయిన్ 7లో

- అభినందించిన జిల్లా ఎస్పి కేకన్ సుధీర్ రామనాథ్...


రంగసాయిపేట వాటర్ ట్యాంకులో నీళ్ల దోపిడీ!

# ప్రైవేటు టాంకర్లు రాకుండా చూస్తాం

- మున్సిపల్ డిఈఈ రంగారావు
- 'జనంసాక్షి' కథనానికి స్పందన

**వరంగల్ బ్యూరో, మే 18 (జనం సాక్షి) :** రంగసాయిపేట వాటర్ ట్యాంకులోకి ప్రైవేట్ ట్యాంకర్లు రాకుండా చూస్తామని, నీళ్ల పట్టుకుపోకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ డి ఈ ఈ రంగారావు అన్నారు.

వార్త మెయిన్ 7లో

# యువతకు శారీరక దృఢత్వం అవసరం

## ఎంపీడీఓ తరుణి ప్రసాద్




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**యువతకు శారీరక దృఢత్వం అవసరమని భూపాలపల్లి ఎంపీడీఓ తరుణి ప్రసాద్ అన్నారు. ప్రజా పాలన - 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామపంచాయతీలో వాకథాన్, యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ తరుణి ప్రసాద్ హాజరై మాట్లాడుతూ ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణలో భాగంగా మండలస్థాయి వాకథాన్, యోగా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ వారోత్సవాలు కేవలం కొన్ని కార్యక్రమాల సమాహారం మాత్రమే కాదని, ఇది మన యువతలో దాగున్న అద్భుతమైన ప్రతిభను, సామర్థ్యాన్ని వెలికితీసే ఒక గొప్ప ఉద్యమం అని చెప్పారు. శారీరక దృఢత్వం (ఫిజికల్ లిటరసీ), కెరీర్–నైపుణ్యాభివృద్ధి, యువ నాయకత్వం, క్రీడలు, సేవా రంగం, ఉద్యోగ సాధన వంటి రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తెలంగాణ ఉజ్వల భవిష్యత్తుకు ఈ కార్యక్రమం బలమైన పునాది వేస్తోందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ, ఏపీఓ, గ్రామ సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు, యువజన సంఘాలు, యువకులు పాల్గొన్నారు.

# తాడిచర్లలో వడదెబ్బతో మహిళ మృతి



**మల్హార్,మే 18(జనంసాక్షి)**మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన తిక్క రమ (55) వడదెబ్బతో మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల పూర్తి కథనం ప్రకారం రమా ఆదివారం ఉదయం పిఏసిఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో తమ వడ్లను నేర్పుతున్న క్రమంలో తలతిప్పి వాశీతులు చేసుకొని కుప్పకూలినట్లుగా స్థానికులు తెలిపారు.అకాల వర్షాలు పడడంతో వడ్లు తడిసిపోయాయి దీంతో ప్రతిరోజు రమ కుటుంబ సభ్యులతో కలిసి వడ్లను ఆరబెట్టడానికి ఉదయం నుండి సాయంకాలం వరకు ఎండలో వడ్లను ఆరబెట్టడానికి ఎండలో పనిచేయడం వల్ల ఆదివారం వడదెబ్బ తగిలి అక్కడే స్పృహ కోల్పోయింది దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక వైద్యులకు చూపించి వెంటనే భూపాలపల్లిలోనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు హనంకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి పంపించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.దీంతో కుటుంబంతోపాటు తాడిచర్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కైరగూడలో కార్మికుల సమస్యలపై టీబీజీకేఎస్ నాయకుల ఆరా




**రెబ్బెన, మే 18( జనం సాక్షి)**తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కైరగూడ ప్రాంతంలో కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాసరావు, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు హాజరై కార్మికులను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలు, ఇబ్బందులు, విధుల్లో ఎదురవుతున్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బొగ్గుగని కార్మికుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం టీబీజీకేఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా విధుల్లో భద్రతా ప్రమాణాలు, సౌకర్యాలు, కార్మిక సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.కార్మికులు కూడా తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరారు. కార్మికుల ఐక్యతతోనే వారి హక్కులు సాధ్యమవుతాయని నాయకులు పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం పలువురు కార్మికులు టీబీజీకేఎస్ నాయకత్వానికి తమ మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ బొంగు వెంకటేష్, సెంట్రల్ కమిటీ సభ్యుడు ఓరం కిరణ్, సి రిలే షిఫ్ట్ ఇన్‌చార్జి శాలిగాం రవి, నాయకులు శనిగారపు రమేష్, గజ్జ కుమార్, రాజమౌళి, అజీమ్, దుంపల బాపు తదితర నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్ళలో ఎలాంటి జాప్యం చేయవద్దు

## ములుగు డీఎస్పీ



**ములుగు,మే18(జనం సాక్షి):**-సోమవారం రోజున ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు ములుగు జిల్లాలో వరి కొనుగోళ్లు ఎలాంటి అవాంతరలు లేకుండా సజావుగా జరగాలని ములుగు డీఎస్పీ ఎన్.రవీందర్ ఆధ్వర్యంలో ములుగు జిల్లా పౌర సరఫరాల అధికారులు, ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రేసిడెంట్, ఎఎంసి చైర్మన్, ములుగు సిఐ, ములుగు స్పెషల్ బ్రాంచ్ సిఐ, ములుగు ఎస్ఐలు,రవాణా శాఖ అధికారులు పాల్గొనడం జరిగింది.
ఈ మీటింగ్ లో ములుగు డీఎస్పీ మాట్లాడుతూ ,రైతులు పండించిన పంటను కొనుగోలు సెంటర్లలో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే కొనుగోలు చేయాలనీ వాతావరణం లో మార్పుల దృష్ట్యా రైతులు ఆందోళన చెందుతారు.కావున వేగవంతంగా కొనుగోళ్లు చేయాలనీ దానికి కావాల్సిన అవసరాలను సివిల్ సప్లై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రం నుండి మిల్లులకు ధాన్యాని తరలించడానికి కావాల్సిన లారీలను కొనుగోలు కేంద్రం మరియు సివిల్ సప్లై అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడ అవసరం ఉన్నాయో ముందుగానే తెలుసుకొని ఎలాంటి కొరత లేకుండా వాహనాలను సర్దుబాటు చేయాలనీ రవాణా శాఖ అధికారులను మరియు లారీ అసోసియేషన్ వారిని, ఆదేశించడం జరిగింది.అదేవిదంగా మిల్లర్లు కూడా ఎలాంటి జాప్యం లేకుండా వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలనీ తెలపడం జరిగింది .అదేవిదంగా పోలీస్ శాఖ తరుపున ఏవిధమైన సహాయం అయిన చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారికీ తెలియజేయడం జరిగింది.

# సీహెచ్పీలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాలు

## ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ఉద్యోగులు కృషి చేయాలి



**రామకృష్ణాపూర్, మే 18(జనంసాక్షి):** సింగరేణి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని అధికారులు సూచించారు. సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు అన్ని ఏరియాల్లో నిర్వహిస్తున్న మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాల్లో భాగంగా సోమవారం మందమర్రి ఏరియా పరిధిలోని రామకృష్ణాపూర్ సీహెచ్‌పీలో మొదటి షిఫ్ట్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు.ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మార్గదర్శకత్వంలో జరిగిన సమావేశంలో కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలపై అధికారులు ఉద్యోగులకు అవగాహన కల్పించారు. భూగర్భ, ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఆధునిక యంత్రాల వినియోగం, పనితీరు మెరుగుదల, ఉత్పత్తి పెంపుపై చర్చించారు. ఉద్యోగుల సంక్షేమ పథకాలు, ఆర్థిక అంశాలను వివరించారు.సంస్థ భవిష్యత్ కార్యాచరణ, ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగమించే మార్గాలపై కూడా చర్చించారు. ఉద్యోగులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ యాజమాన్యం సూచనలు పాటిస్తే లక్ష్యాలను సాధించడం సులభమవుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎస్వో టు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు ఇప్పకాయల లింగయ్య, ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి, అధికారులు ఆర్‌వీఎస్ఆర్‌కే ప్రసాద్, చి. అశోక్, కె. కిరణ్ కుమార్, రవి, ప్రదీప్, చంద్రమౌళి, మేనేజ్‌మెంట్ ట్రైనీ శ్యామ్‌తో పాటు సీహెచ్‌పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

- అధికారులు అన్ని ఏర్పాట్లు పగడ్బందీగా చేయాలి..జిల్లా కలెక్టర్ బవేశ్ మిశ్రా



**నిర్మల్ రురల్,మే 18,(జనం సాక్షి)** బక్రీద్ పండుగను జిల్లా వ్యాప్తంగా ప్రశాంత, భక్తిశ్రద్ధల వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ అధికారులతో కలిసి పండుగ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఈద్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రార్థనా స్థలాల్లో తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. అలాగే విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.పండుగ సందర్భంగా పురపాలక, గ్రామపంచాయతీ అధికారులు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి ఈద్గాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సంబంధిత శాఖలకు తెలిపారు. జిల్లా ప్రజలు అన్ని పండుగలను పరస్పర సహకారం, సామరస్యంతో జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున తగిన బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, హిందూ–ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# ఫకీర్ నాయక్ తండాలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

**కుబీర్, మే 18, (జనంసాక్షి):** కుబీర్ మండలం సిరిపెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఫకీర్ నాయక్ తండాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్డు పనులను సోమవారం ఘనంగా ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ ప్రత్యేక కృషితో మంజూరైన రూ. 15 లక్షల నిధులతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ క్రాంతి రాజ్ చవాన్ భూమి పూజ నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి పనులను అధికారికంగా ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే పటేల్ నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సంద´ర్భంగా నేతలు కొనియాడారు. ఈ కార్యక్ర మంలో నిర్మల్ జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ బంక బాబు, కుబీర్ మండల అధ్యక్షులు బషీరుద్దీన్, జనరల్ సెక్రెటరీ పి.శివాజీ వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, తండా వాసులు పాల్గొన్నారు.



# మందమర్రిలో యథేచ్ఛగా ఓవర్‌లోడ్ బొగ్గు లారీలు

## టార్పాలిన్ కు స్వస్తి పలికిన వైనం

## రవాణాశాఖ నిర్లక్ష్యంపై ప్రజల్లో ఆగ్రహం



**రామకృష్ణాపూర్, మే 18(జనంసాక్షి):** ఆర్కేపీ, మందమర్రి పట్టణాల్లో ఓవర్‌లోడ్‌తో బొగ్గు లారీలు రహదారులపై యథేచ్ఛగా దూసుకుపోతుండటం ప్రజల్లో తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రధాన రహదారులు, కాలనీలు, పాఠశాలల సమీప ప్రాంతాల్లో సైతం అధిక బరువుతో వెళ్తున్న లారీలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రాత్రింబవళ్లు ఎలాంటి నియంత్రణ లేకుండా బొగ్గు లారీలు సంచరిస్తుండగా, సంబంధిత అధికారులు మాత్రం చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలోని పలు బొగ్గు గనుల నుంచి పెద్ద ఎత్తున బొగ్గు రవాణా కొనసాగుతోంది. ఈ క్రమంలో కొంతమంది లారీ యజమానులు అధిక లాభాల కోసం నిబంధనలకు విరుద్ధంగా ఓవర్‌లోడ్‌తో వాహనాలు నడుపుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సామర్థ్యానికి మించి బొగ్గు లోడ్ చేయడం వల్ల లారీలు అదుపుతప్పే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, ఎప్పుడెప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు.ఓవర్‌లోడ్ లారీల కారణంగా రహదారులు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. రోడ్లపై గుంతలు ఏర్పడి సాధారణ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా బొగ్గు ధూళి కారణంగా కాలుష్యం పెరిగి ప్రజలు శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇన్ని సమస్యలు తలెత్తుతున్నప్పటికీ రవాణాశాఖ అధికారులు మాత్రం కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. మంచిర్యాల జిల్లా రవాణాశాఖకు ఓవర్‌లోడ్ లారీలు కనిపించడం లేదా– లేక కావాలనే కళ్లు మూసుకుందా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. తరచూ తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు కేవలం పేరుకే డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తు న్నాయి.నిబంధనలు సామాన్యులకేనా–బొగ్గు లారీ లకు ప్రత్యేక మినహాయింపులా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చిన్న వాహనాలపై వెంటనే జరిమానాలు విధించే అధికారులు, భారీగా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న బొగ్గు లారీల విషయంలో మాత్రం ఎందుకు మౌనం పాటిస్తున్నారని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా రవాణాశాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఓవర్‌లోడ్ లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఫిట్ అండ్ ఆక్టివ్ తెలంగాణ మారథాన్‌కు భారీ స్పందన



**నిర్మల్ బ్యూరో, మే 18:(జనంసాక్షి)** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా, వ్యాయామం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు.ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక యువజన, క్రీడా వారోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ఫిట్ అండ్ ఆక్టివ్ తెలంగాణ, మారథాన్ అండ్ ఫిజికల్ లిటరసీ కార్యక్రమానికి భారీ స్పందన లభించింది. పట్టణంలోని శివాజీ చౌక్ నుండి ప్రారంభమైన మారథాన్ ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. యువత, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, నిత్య వ్యాయామం ద్వారా అనేక దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసుకోవచ్చని తెలిపారు. యోగా, వ్యాయామం శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా అందిస్తాయని చెప్పారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డిఈఓ భోజన్న, డిఆర్డీఏ పిడి విజయలక్ష్మి ,సిపిఓ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యల పరిష్కారంపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, మే18, (జనంసాక్షి)**ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణం జాఫర్ నగర్ ప్రాంతానికి చెందిన పర్వీన్ సుల్తానా, ఫర్జానా నిరుపేద అయిన తమకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కమ్మరి రాజేశ్వరి నిరుపేద అయిన తనకు ఒంటరి మహిళ పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం ఎన్ టి ఆర్ నగర్ కు చెందిన ముజ్జిగ స్వప్న కూలి పని చేసుకుంటూ జీవిస్తున్న నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో ఎస్ సి నేతకాని గూడెంలో మంజూరు అయిన బోర్ వెల్ ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం వినాయక నగర్ కాలనీవాసులు తమ కాలనీలో ఇండ్ల మధ్యలో నిర్వహిస్తున్న బీడీ ఫ్యాక్టరీని తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం మాకులపేట గ్రామానికి చెందిన ముత్తినేని రాజమణి తన పొలంలో సాగు చసిన మొక్కజొన్న పంట చేతికి వచ్చే సమయంలో అడవి పందులు పూర్తిగా నాశనం చేశాయని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ....ప్రజావాణి కార్యక్రమంలో 64 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.అనంతరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు పర్యాటక రంగం ఆధ్వర్యంలో నిర్వహించవలసిన కార్యక్రమాల సంబంధిత కరపత్రాలు, గిరిజనుల సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన జన జాతీయ గరిమ ఉత్సవ్ 2026 సంబంధిత గోడ ప్రతులను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. యువ టూరిజం క్లబ్, అవగాహన కార్యక్రమాలు, హెరిటేజ్ వాక్, స్థానిక ఇన్ఫ్లుయెన్సర్/యూట్యూబర్స్‌తో సమావేశం, స్వచ్ఛత, టూరిజం బ్రాండ్ విడుదల, పారిశుధ్యం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ లో భాగంగా గిరిజన గ్రామాలలో రహదారులు, త్రాగునీరు, ఆరోగ్యం, విద్యుత్, ఇండ్ల నిర్మాణం వంటి కనీస సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండగ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

## నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి



**నిర్మల్,మే18,(జనంసాక్షి)** బక్రీద్ పండగ సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో మున్సిపల్ శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నాయని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు . కలెక్టర్ కార్యాలయ సమావేశ హాల్లో నిర్వహించిన బక్రీద్ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా పరిశుభ్రత, వ్యర్థాల తొలగింపు, నీటి సరఫరా, వీధి దీపాలు మరియు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని దాదాపు 16 చోట్ల త్రాగు నీటీ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఎక్కడ ఆసకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే కమిషనర్, తన దృష్టికి తీసుకురావాలన్నారు.

# ఖాళీ బిందెలతో మహిళల నిరసన



**వరంగల్ మండలం, మే 18 (జనం సాక్షి)** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని 39 వ డివిజన్ కరీమాబాద్ లక్ష్మీ నగర్ బిజెపి కరీమాబాద్ మండల అధ్యక్షులు బోరిగం నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. తమ ఏరియాలో సుమారు ఏడాదికాలంగా నల్లాల ద్వారా నీరు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు బోరిగం నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా పరిపాలన పేరుతో గొప్పలు చెప్పుకుంటుందని, మంత్రి ఇలాక అయినటువంటి కరీమాబాద్ లక్ష్మీ నగర్ ప్రాంతంలో సుమారు 350 కుటుంబాలకు నల్లాల ద్వారా నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమస్యపై మున్సిపల్ అధికారులకు సంబంధిత పబ్లిక్ హెల్త్ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించిన ఇప్పటివరకు సమస్య పరిష్కరించలేదని అన్నారు. ఇప్పటికైనా లక్ష్మీ నగర్ వాసులకు నల్లాల ద్వారా నీరు అందే విధంగా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసన కార్యక్రమంలో మాదాసు రాజు, రాధారపు మహేష్, ఉమ్మడిశెట్టి రాజు, టేకుమట్ల రేణుక, నిర్మల, గృహవాసులు పాల్గొన్నారు.

# ఉన్నత స్థాయికి చేరాలంటే సమ్మర్ క్యాంపులు అవసరం

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరాలంటే సమ్మర్ క్యాంపులు ప్రత్యేక అవసమని, క్యాంపు లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో భూపాలపల్లి కృష్ణ కాలనీలోని అంబేద్కర్ గ్రౌండ్ లో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ క్యాంప్ కు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ విద్యార్థులు తమకు నచ్చిన క్రీడలపై ఆసక్తి పెంచుకొని ఉన్నత స్థాయికి చేరుకునే విధంగా ఈ సమ్మర్ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సరైన శిక్షణతో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలకు ఎదగవచ్చని పేర్కొన్నారు. యువత క్రీడలను అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, విద్యార్థులు, యువత, కోచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పంట చేలకు రోడ్డు నిర్మాణం చేపట్టాలి



**నూగూర్ వెంకటాపురం మే 18(జనం సాక్షి ):-** వెంకటాపురం మండల కేంద్రంలోని విఆర్కే పురం గ్రామపంచాయతీ పరిధిలో ని పంట పొలాల్లోకి రోడ్డు నిర్మాణం చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర వాడబలిజ సేవా సంఘం అధ్యక్షుడు దర్ర దామోదర్ తాసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో వాడపల్లి సేవా సంఘం అధికార ప్రతినిధి తోట మల్లికార్జున రావు పాల్గొని మాట్లాడుతూ వి ఆర్ కె పురం నుండి గోదావరిగూడెం జడ్ సంబంధించిన రోడ్ల గతంలో ఎంపీడీవో కిఎన్ఆర్ఈజీఎస్ గ్రాంట్ కింద రోడ్డు మంజూరు చేయాలని మెమొరాడం ఇవ్వడం జరిగిందని అన్నారు. రోడ్డు లేక రైతుల పంటచేయులకు వెళ్లాలంటే నానా అవస్థలు పడుతు న్నారని అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ గ్రాండ్ ద్వారా మంజూరైనటువంటి రోడ్లు ఏఆర్కే పురం శివారులోని జల్లిగంపల కళాధర్ శీను దగ్గర నుండి 37 మీదుగా గోదావరి రోడ్ ఉన్నటువంటి గుండు రామయ్య సీన్ వరకు నాలుగు కిలోమీటర్ల నిర్మాణం ఏర్పాటు చేయాలని అన్నారు. 1953 గోదావరి ముందు బూరుగూడెం గ్రామంలో గోదావరి నది కూడా ఉన్నటువంటి కాలంలో రెవెన్యూ లెక్కల ప్రకారం రోడ్లు ఎలా ఉన్నాయి అదేవిధంగా ఇప్పుడు నక్ష ప్రకారం ఎన్ని లింకులు ఉంటే అన్ని లింకులు సర్వే చేసి రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేయాలని రైతులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వి ఆర్ కె పురం ఉప సర్పంచ్ పునెం రాజేశ్వరి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తోట ప్రశాంత్, వార్డు సభ్యులు బొగట్ట కళ్యాణ్,గోపి మల్లికార్జున్ లక్ష్మీనారాయణ ,వెంకటేశ్వర్లు ,నాగేశ్వరరావు ,నాగార్జున, పెంటయ్య రమణయ్య తదితరులు రైతులు పాల్గొన్నారు.

# గాంధీనగర్ గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామ నిర్మాణ పై గ్రామ సభ



**గోవిందరావుపేట మండలం. మే( జనం సాక్షి.). 18.05.26** గాంధీనగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ బానోతు నిర్మల వెంకన్న ఆధ్వర్యంలో. 350 మంది గ్రామ ప్రజలతో ఆదర్శ గ్రామ నిర్మాణం పై అవగాహన కల్పిస్తూ గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలవికాస ఆదర్శ గ్రామం పథకం సీనియర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వసంత. మాట్లాడుతూ ఆదర్శ గ్రామం అంటే రోడ్డు భవనాలు నిర్మించుకోవడం కాదు వినూత్న కార్యక్రమాలను చేపడుతూ క్రమశిక్షణతో గ్రామ ప్రజలందరూ కట్టు బాట్లు నియమాలు పద్ధతులు పెట్టుకుని వాటిని పాటిస్తూ ఊరంతా కలిసి ఒకే మాట ఒకే బాటలో ఐక్యముతో ఉంటే ఆదర్శ ఆదర్శ గ్రామం. సాధించుకోవచ్చని. అభివృద్ధి గ్రామానికి ఆదర్శ గ్రామానికి తేడా మనకు అర్థం కావాలని డబ్బులుంటే అభివృద్ధి చేసుకోవచ్చు కానీ ఆదర్శ గ్రామమంటే ప్రజలందరూ కలిసి ఒకరికొకరు ఆలోచనలు అభిప్రాయాలు పంచుకుంటూ ఐక్యమత్యంతో గ్రామంలో ఉన్న వనరులను గుర్తించి వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం వల్ల గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించుకోవచ్చు. ఈ సందర్భంగా ఎనిమిది కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది అనంతరం గ్రామ సర్పంచ్ బానోత్ ,నిర్మల వెంకన్న. మాట్లాడుతూ మా గ్రామంలో పాల వికాసం సంస్థ ద్వారా నిర్వహించే ప్రతి కార్యక్రమానికి గ్రామపంచాయతీ నుండి పూర్తి సహకారం అందిస్తాము బాలవికాస ఆదర్శ గ్రామ నిర్మాణ పథకంలో మా గ్రామం ఎన్నుకున్నందుకు మాకు చాలా సంతోషంగా ఉంటుందన్నారు. ఈరోజు మా గ్రామంలో ఒక పండగ వాతావరణం ఉందన్నారు గ్రామ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛందంగా గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం తీసుకోవడానికి ముందుకొచ్చిన కమిటీ వాళ్లకు అభినందనలు తెలుపుతున్నాము అందరం కలిసి మన గ్రామాన్ని మార్చుకున్నామని గ్రామస్తులకు పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో, గ్రామ ఉపసర్పంచ్ వల్లపు మహేష్,.పంచాయతీ కార్యదర్శి రఘు, వార్డు సభ్యులు, మాలోత్ శంకర్, కూరాకుల సురేష్, రామావత్ సంధ్య, తేజావత్ హుని, లిక్కి కుమారస్వామి, లాకావత్ ఈరయ, బాలవికాస ప్రాజెక్టు కోఆర్డినేటర్ రాజ్ కుమార్ , డెవలప్మెంట్ ఏజెంట్లు , కే వినయ్ కుమార్, శంకర్ గ్రామం పెద్దలు గ్రామ ప్రజలు యువకులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా సంఘాల సభ్యులందరికీ వ్యక్తిగత పాస్ పుస్తకాలు అందించాలి



## గొంది దేవేంద్ర ఐద్వా జిల్లా అధ్యక్షురాలు

**గోవిందరావుపేట. మే. ( జనం సాక్షి ). 18.05.26.** మహిళా సంఘాల సభ్యులందరికీ వ్యక్తిగత పాసు పుస్తకాలు అందించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు గొంది దేవేంద్ర అన్నారు. సోమవారం మండలంలోని పసర గ్రామంలో ఐద్వా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శి రామోజీ సువర్ణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దేవేంద్ర హాజరై మాట్లాడారు. మండల వ్యాప్తంగా మహిళా సంఘాలలో వేలాది మది మహిళలు సభ్యులుగా ఉంది రుణాలు పొంది వాయిదాల పద్ధతిలో ప్రతినెల చెల్లిస్తున్నారు.. చెల్లింపులకు సంబంధించిన వివరాలు కేవలం లీడర్ బుక్కులకే పరిమితం అవుతున్నాయి. దీనివల్ల స్వల్పంగా కొన్ని అవకతవకలు జరిగి కొందరు సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. నమ్మకం మీద డబ్బులు చెల్లించినా కూడా ఖాతాలో జమ కాలేదని కొందరు మహిళా సంఘాల సభ్యులు దృష్టికి తీసుకురావడం జరిగిందని అన్నారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా ఉండే విధంగా ప్రభుత్వం రూపొందించిన సభ్యుల వ్యక్తిగత పాసు పుస్తకాలపై ప్రతినెల సభ్యులు చెల్లించిన పైకం మొత్తాన్ని తీసుకున్న వారు సంతకం చేయడం ద్వారా సభ్యులకు సంతృప్తికరంగా ఉంటుందని అన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులు వెంటనే స్పందించి సమాఖ్య పరిధిలోని అన్ని సంఘాల సభ్యులకు వ్యక్తిగత పాసుపుస్తకాలు అందే విధంగా చర్యలు చేపట్టాలని ఐద్వా తరపున తాము కోరుతున్నామని అన్నారు. దీనిపై గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సంఘం సభ్యులు నాయకులు సమ్మక్. రాజేశ్వరి. కంసల్య. అనసూర్య. అచ్చమ్మ. కమలమ్మ. తదితరులు పాల్గొన్నారు.

# సంఘం డబ్బులు వాడుకున్న ముష్కమల్ల సుధాకర్



**వరంగల్ ఈస్ట్, మే 18 (జనం సాక్షి)**వరంగల్ నగరంలోని అండర్ రైల్వే గేట్ శాంతినగర్ లో గల రుద్రమదేవి పరపతి సంఘం డబ్బులను సంఘ డైరెక్టర్ అయినటువంటి పుష్కమల్ల సుధాకర్ వాడుకున్నాడని ఇదే సంఘం డైరెక్టర్లు పూజారి సంపత్, గుంటి వీరేందర్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం వారు సంఘ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2015లో రుద్రమదేవి పరపతి సంఘాన్ని ముష్క మల్ల సుధాకర్, గాదె మధుసూదన్, మంద శ్రీనివాస్, పూజారి సంపత్, గుంటి వీరేందర్లు కలిసి ప్రారంభించారని తెలిపారు. సంఘంలో 1300 మంది సభ్యులు ఉండేవారన్నారు. అయితే కొంతకాలం సంఘం బాగానే నడిచిందని, సుమారు రెండు ఏళ్ల క్రితం సంగం మూసేసినట్లు తెలిపారు. అయితే సంఘం డైరెక్టర్ ముష్కమల సుధాకర్ తమ పేరు మీద మొత్తం సుమారు 24 లక్షలు స్పెషల్ లోన్లు తీసుకొని చెల్లించడం లేదని అన్నారు. పైగా తమనే డబ్బులు కట్టాలని అంటున్నట్టు తెలిపారు. అంతేకాకుండా సుమారు 200 మంది సంఘం సభ్యులకు ఒక్కొక్కరికి 12 వేల రూపాయల చొప్పున ఇవ్వాల్సి ఉండగా అవి కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వివరించారు. ఇటీవల సంఘం సభ్యులు సంఘం కార్యాలయం వద్ద ధర్నా చేశారని అదేవిధంగా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేసినట్లు డైరెక్టర్లు పూజారి సంపత్, గుంటి వీరేందర్లు వివరించారు. ముష్కమల్ల సుధాకర్ దగ్గర సుమారు 40 లక్షల రూపాయలు ఉన్నాయని అవి వెంటనే చెల్లించాలని, సంఘం సభ్యులకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

# పుష్కరాలకు వచ్చే వాహనాల రూట్ మ్యాప్ ఖరారు

**కాళేశ్వరం,మే19,(జనంసాక్షి)** సరస్వతి అంత్య పుష్కరాలకు కాళేశ్వరం సిద్ధమవుతుంది. గోదావరి ,ప్రాణహిత, సరస్వతీ నదుల కలయికైన ప్రముఖ త్రివేణి సంగమ క్షేత్రం కాళేశ్వరం లో మే 21 నుంచి జూన్ 1 వరకు సరస్వతి అంత్యపుష్కరాలు జరగనున్నాయి. ఈ సందర్భ ంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తోంది. భక్తుల రాకపోకలకు అంతరాయం లేకుండా 250 ఎకరాల్లో పార్కింగ్ సదుపా యాలు , 2500 మంది పోలీసు సిబ్బంది , సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ, హైటెక్ డ్రోన్లు నిఘా , ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా అనుక్షణం పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. పుష్కర స్నానం పాప ప్రక్షాళనకు ప్రతీక అయితే భక్తుల భద్రత పోలీసు శాఖకు ప్రధానమని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ నుండి వచ్చే వాహనాలు గూడెపాడు క్రాస్, భూపాలపల్లి మీదుగా బస్వాపూర్ క్రాస్, కొయ్యూరు, గంగారం ఎక్స్ రోడ్ మీదుగా విలాసాగరం , దామరకుంట, అన్నారం, మద్దులపల్లి మార్గాల ద్వారా వచ్చి సరస్వతి ఘాట్ పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు పార్క్ చేసుకోవాలని పోలీసు అధికారులు తెలిపారు. ఆసిఫాబాద్, మంచిర్యాల, చెన్నూరు, సిరంచ ,ఛత్తీస్గఢ్ మీదుగా వచ్చే వాహనాలు అంతర్ రాష్ట్ర వంతెన దాటిన తర్వాత ఏర్పాటుచేసిన పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు నిలపాలని సూచించారు. కరీంనగర్ నుంచి వచ్చే వాహనాలు గంగారం క్రాస్ రోడ్డు మీదుగా అన్నారం మద్దులపల్లి మార్గాల ద్వారా వచ్చి సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటుచేసిన పార్కింగ్ ప్రదేశాలను వాహనాలను ఉంచాలని వారు సూచించారు. తిరుగు ప్రయాణంలో కాళేశ్వరం, మహాదేవపూర్ మీదుగా వాహనాలు వెళ్లాలని పోలీస్ అధికారులు తెలిపారు. ఆర్టీసీ బస్సులు, వీఐపీ వాహనాలు గారేపల్లి, మహాదేవపూర్ మీదుగా కాళేశ్వరం చేరుకొని తిరిగి అదే దారిలో వెళ్లాలని సూచించారు.

# కోతలు లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**ఎలాంటి కోతలు లేకుండా పారదర్శకంగా కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి మండలం ఎస్.ఎం. కొత్తపల్లి గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చే వరి ధాన్యాన్ని తేమ శాతం నిర్ధారణ అయిన వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కొనుగోలు కేంద్ర ఇన్చార్జ్ను ఆదేశించారు. రైతులకు ఎలాంటి కోతలు లేకుండా అధికారులు పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వానాకాలం ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున రైతులకు అవసరమైన పరదాలను ప్యాక్స్ ద్వారా అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి, భూపాలపల్లి ప్యాక్స్ చైర్మన్, సీఈఓ, ముఖ్య నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో వరదలపై మాక్ డ్రిల్ నిర్వహణ



**కాళేశ్వరం, మే 19 , ( జనం సాక్షి)**భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాళేశ్వరం లో గోదావరి నదిపై వరదలు సంభవించిన సందర్భంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, సహాయక చర్యలపై ప్రజలకు మరియు సిబ్బందికి అవగాహన కల్పించే ఉద్దేశంతో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (చీణహీా) ఆదేశాల మేరకు సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్‌ను ఎస్‌డీఆర్‌ఎఫ్, రెస్క్యూ బృందాలు, ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ మరియు పోలీస్ శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి పాల్గొని మాక్ డ్రిల్‌ను పరిశీలించారు. వరదల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించడం, గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందించడం, సమాచార వ్యవస్థలో సమన్వయం వంటి అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ వర్షాకాలంలో వరదల ప్రమాదం అధికంగా ఉండే ప్రాంతాల్లో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు కూడా అధికారుల సూచనలను పాటిస్తూ పోలీస్ మరియు రెస్క్యూ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా విపత్తు నిర్వహణలో శాఖల మధ్య సమన్వయం మరింత మెరుగుపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వేతనాలు పెంచి న్యాయం చేయండి



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 18(జనంసాక్షి ):**ఐ టీ డి ఎ జీసీసీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ కు చెందిన పెట్రోల్ పంపుల్లో చేస్తున్న నౌజల్ ఆపరేటర్లకు నెలవారి కనీస వేతనం15000 వేలకు పెంచాలని కోరుతూ వివిధ మండలాలకు చెందిన ఆపరేటర్లు సోమవారం నాడు ఐటీడీఏ పిఓ మంద మకరంద ఐ ఎ ఎస్ కు వినతిపత్రం అందజేశారు. వారి డిమాండ్స్ కు జాతీయ మానవ హక్కుల కమిటీ కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ మద్దతు తెలిపారు. రాథోడ్ రమేష్ మాట్లాడుతూ ఆరేళ్లుగా ఐటిడిఏ జిసిసి పరిధిలో పనిచేస్తున్న ఆపరేటర్లు చాలీచాలనీ 8500 రూపాయల వేతనాలతో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రింబవళ్లు డ్యూటీలు చేస్తూ కనీసం రోజువారీగా కూలీ కూడా గిట్టని పరిస్థితిలో బతుకులీడుస్తున్నారని ఐటిడిఏ పిఓ, ప్రభుత్వం స్పందించి వారికి రోజుకు 500 కూలి గిట్టుబాటు అయ్యే విధంగా కనీసం నెలకి వేతనం 15,000 రూపాయలకు పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రాసిమెట్ట గ్రామపంచాయతి రోడ్‌గూడలో హ్యాండ్ బోర్‌ను ప్రారంభించిన ఆత్రం సుగుణక్క

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 18(జనంసాక్షి ):**జైనూర్ మండలం రాసిమెట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని రోడ్‌గూడలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఇటీవల గ్రామస్తులు డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కను సంప్రదించారు. సమస్యపై స్పందించిన సుగుణక్క సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామంలో హ్యాండ్ బోర్ ఏర్పాటు చేయించారు. ఈ మేరకు సోమవారం సుగుణక్క రోడ్‌గూడకు వెళ్లి నూతనంగా ఏర్పాటు చేసిన హ్యాండ్ బోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని సుగుణక్క పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉయిక గ్రామ పటేల్, కుంరం ర్పంచ్ దుర్వ సింధు తదితరులు పాల్గొన్నారు.



## సేంద్రియ వ్యవసాయాన్ని ఆచరణలోకి తీసుకురావాలి

### వ్యవసాయ శాస్త్రవేత్త విద్యాధర్



**శాయంపేట ,మే 18 (జనం సాక్షి)**శాయంపేట మండలం మైలారం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సేంద్రియ ధృవీకరణ, శాస్త్రీయ సేంద్రియ వ్యవసాయ నిర్వహణ పద్ధతులపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డా. బి. విద్యాధర్ , డా. సిద్ధార్థ నాయక్ టీచింగ్ అసోసియేట్ పాల్గొని సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల భౌతిక, రసాయన మరియు జీవ లక్షణాల మెరుగుదల గురించి వివరించారు. రసాయన ఎరువులు మరియు క్రిమిసంహారక మందుల అధిక వినియోగం వల్ల నేల సూక్ష్మజీవుల సమతుల్యత దెబ్బతింటుందని, దీని ప్రభావం దిగుబడులపై దీర్ఘకాలికంగా పడుతుందని తెలిపారు. జీవామృతం, ఘన జీవామృతం, వర్మీ కంపోస్ట్, పంట అవశేషాల పునర్వినియోగం, గ్రీన్ మ్యాన్యూరింగ్, బయోఫెర్టిలైజర్స్ మరియు బయోపెస్టిసైడ్స్ వినియోగం ద్వారా నేల సేంద్రియ కార్బన్ శాతం పెరిగి, నీటి నిల్వ సామర్థ్యం మరియు పోషక లభ్యత మెరుగుపడుతుందని వివరించారు. సేంద్రియ ధృవీకరణ ద్వారా ఉత్పత్తుల నాణ్యతకు అధికారిక గుర్తింపు లభించి, రైతులు జాతీయ మరియు అంతర్జాతీయ మార్కెట్లలో అధిక ధరలకు తమ ఉత్పత్తులను విక్రయించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని మాట్లాడుతూ వరి మరియు మొక్కజొన్న పంటల కోతల అనంతరం రైతులు పంట అవశేషాలను తగులబెట్టకుండా, వాటిని నేలలో కలిపి భూమి సారాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూనె దివ్య -తిరుపతి, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## యోగ చేయడం వలన ఆరోగ్యాన్ని మెరుగు పరుచుకోవచ్చు



**నడి కూడ మే 18 (జనం సాక్షి) :** యోగ చేయడం వలన ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని ఆయుస్సు పెంచుకోవచ్చని నడి కూడా మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామ రామ కృష్ణ అన్నారు. సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో బాగంగా నడికూడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంనుండి రెండు కిలోమీటర్లు వాక్ థాన్ కార్యక్రమాన్ని తహసీల్దార్ రాణి ఎంపిడిఓ రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యోగ చేయడం జరిగింది యోగ చేయడం వలన మనం ఎంతో ఆరోగ్యంగా ఉండవచ్చునని ,మన ఆయుస్సు మనమే పెంచుకున్న వాళ్ళము అవుతామని , ప్రతిరోజు మన ఆరోగ్యం కొరకు 45 నిమిషాలు అయిన సమయం కేటాయించు కోవాలని ఎంపిడిఓ రామకృష్ణ తెలియజేశారుఅదే విధంగా ప్రభుత్వ పాఠశాలలు కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని ప్రైవేట్ పాఠశాలలు పంపకుండా ప్రభుత్వ పాఠశాలకు మీ పిల్లలను పంపాలని మంచి ఉన్నత చదువులు చదుకుని ప్రభుత్వం పెట్టే పరీక్షల్లో పాస్ అయ్యి ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు ఉన్నారు అని చెప్పడం జరిగింది మరియు ఉచితంగా పుస్తకాలు,బట్టలు,మధ్యాహ్నం భోజనం కూడ ప్రభుత్వం అందిస్తుందని తెలిపినారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ రవిబాబు ఎస్ఐ పవన్ మండల పంచాయతీ అధికారి మార్గవి రెడ్డి డిప్యూటీ తహసిల్దార్ సత్యనారాయణ రెవిన్యూ ఇన్స్పెక్టర్లు మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రవీందర్ యాదవ్ సర్పంచులు భోగి శీలత ఓదెల శ్రీలత జగత్ ప్రకాష్ ఫిజికల్ డైరెక్టర్ శివ కార్యాలయ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు

## 23 వరకు ఆర్ట్స్ కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్- సమర్పించాలి



**హనుమకొండ ప్రతినిధి మే 18 (జనం సాక్షి) :** హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ ప్రవేశాలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. దోస్త్ అడ్మిషన్ ప్రక్రియలో భాగంగా మొదటి దఫా( ఫేస్)లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీఏ ఆనర్స్, బీఏ జర్నలిజం తదితర కోర్సుల్లో మొత్తం 1225 మంది విద్యార్థులు చేరిక కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి ఫేస్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 23వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సూచించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసిన విద్యార్థులకే అడ్మిషన్ ప్రక్రియ పూర్తయినట్లుగా పరిగణిస్తామని తెలిపారు. రెండవ ఫేస్ అడ్మిషన్ల ప్రక్రియ ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభమైందని, 25వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే మొదటి ఫేస్‌లో ఎంపికైన విద్యార్థులు ఆలస్యం చేయకుండా వెంటనే సెల్ఫ్ రిపోర్టింగ్ సమర్పించాలని సూచించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ఉద్యోగ కల్పన ఆధారిత కోర్సులు అధికంగా అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు తగిన కోర్సులను ఎంపిక చేసుకొని చేరాలని ప్రొఫెసర్ జ్యోతి విజ్ఞప్తి చేశారు. కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు, వివిధ క్రీడా పోటీలు కళాశాలలో నిరంతరం నిర్వహించబడతాయని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో కళాశాలలో ప్రత్యేక ఉద్యోగ కల్పన కేంద్రం పనిచేస్తోందని, ఆ కేంద్రం ద్వారా ప్రముఖ సంస్థల్లో ప్లేస్మెంట్ అవకాశాలు కల్పిస్తున్నట్లు ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు.

## శివ బాలాజీ ఫ్లై యాష్ బ్రిక్స్ ప్రారంభించిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

**రెబ్బెన, మే18 (జనం సాక్షి):** రెబ్బెన మండలం పులి కుంట గ్రామంలో రెబ్బెన పీఏసీఎస్ వైస్ చైర్మన్ రంగు మహేష్ గౌడ్, నూతనంగా ఏర్పాటు చేసిన శివ బాలాజీ ఫ్లై యాష్ బ్రిక్స్ యూనిట్‌ను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పరిశ్రమ అభివృద్ధి గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. స్థానికంగా ఇటువంటి పరిశ్రమలు ఏర్ప డడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా రెబ్బెన మండలానికి చెందిన సర్పంచులు, ఉప సర్పంచులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళా నాయకురాళ్లు, శ్రేయోభిలాషులు, మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగు మహేష్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.



# సాగుభూముల్లోకి మురుగు నీటి ప్రవాహం

**పంటలు వేసుకోలేని పరిస్థితి**

**సమస్య పరిష్కరించండి**

**వరంగల్ కలెక్టర్ కు ఖిలా వరంగల్ రైతుల వినతి**





**వరంగల్ ఈస్ట్, మే 18 (జనం సాక్షి)** వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఖిలా వరంగల్ 38వ డివిజన్ మధ్యకోట ప్రాంతంలో గత రెండు సంవత్సరాలుగా సమీప కాలనీల నుండి మురుగు నీరు మరియు మలిన నీరు నేరుగా తమ సాగుభూముల్లోకి ప్రవహిస్తోందనీ ఈ కారణంగా పంటలు దెబ్బతిని రైతులు భారీ ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నట్లు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కిల వరంగల్ కు వచ్చిన వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదాను కలిసి తమ వినతి పత్రం అందించారు. సందర్భంగా వారు తమ వినతి పత్రంలో నేల సారవంతత తగ్గిపోవడంతో పాటు భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల దుర్వాసన, దోమల పెరుగుదల మరియు ఆరోగ్య సమస్యలు కూడా ఏర్పడుతున్నాయి. ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించ లేదు. కాబట్టి సంబంధిత ప్రాంతాన్ని వెంటనే పరిశీలించి, మురుగు నీటి ప్రవాహాన్ని ఆపడానికి తగిన డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేసి, నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు చేయవలసిందిగా ఈ సందర్భంగా రైతులుబండి సమ్మమ్మ, రాజ్యలక్ష్మి, రాజేశ్వరి, భాగ్య, లావణ్య తదితరులు కలెక్టర్ ను కోరారు. ఈ విషయం పై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ ఆఫీస్ కొచ్చి కలవాలని అక్కడ ఈ విషయమై మాట్లాడుతాను అని చెప్పినట్లు బాధిత రైతులు వివరించారు.

# ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధంగా వుండాలి



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 18(జనంసాక్షి ):** రాష్ట్రంలో వరదలు అగ్ని ప్రమాదాలు సంబవించేటప్పుడు ప్రాణ నష్టము ఆస్తి నష్టం జరగకుండా జిల్లా యంత్రంగా సిద్ధంగా వుండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ , పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి 18 జిల్లాలో వరదలు అగ్ని ప్రమాదాలపై నిర్వహించిన మాక్ ఎక్స్ ర్ సైజ్ నమూనా ప్రదర్శన కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటి అధికారులు రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 13 జిల్లాల్లో వర్షాలు అధికంగా కురిసే అవకాశం వుందన్నారు. భారీ వర్షాల వల్ల నదులు వాగులు ఉధృతంగా ప్రవహించే గ్రామాలను లోతట్టు ప్రాంతాలను ముంచే తుత్తాయని ముందస్తుగా ప్రజలను సురక్షితంగా రక్షించేందుకు అధికార యంత్రంగం ఎన్ డి ఆర్ ఎఫ్ ,ఎస్ డి ఆర్ ఎఫ్ సిబ్బంది సిద్ధంగా వుండాలన్నారు. పరిశ్రమలలు వాణిజ్య సముదాయలలో భారీ అగ్ని ప్రమాదాలు ఇటీవల సంబవించి భారీగా ప్రాణ నష్టాలు ఆస్తి నష్టం సంబవించయన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు ప్రమాదాలు సంబంధించినప్పుడు వెంటనే సంఘటన స్థలాన్ని చేరుకొని రక్షణ చర్యలు చేప్పట్టి అస్తి నష్టం ప్రాణ నష్టం జరగకుండా నియంత్రించలన్నారు. అడవులలో నిప్పురవ్వలు పడి అడవి లోని విలువైన సంపద కాలి బూడిద అవుతున్నాయని, అటవి శాఖ సిబ్బంది అప్రమతంగా ఉండి అడవులను రక్షించుకొవలన్నారు. సిబ్బందిని శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రమాదాలు నివారణకు అధికారులు అప్రమత్తంగా వుండాలన్నారు. అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. సమీకృత కలెక్టరేట్ భవనంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి కలెక్టర్ కె హరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని సిర్పూర్ మండలంలోని వేంపల్లి అటవీ ప్రాంతంలో అటవీశాఖ, రెవిన్యూ ,అగ్నిమాపక శాఖ ,రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ, పంచాయతీరాజ్, పోలీస్ వెటర్నరీ విద్య వైద్య ఆరోగ్యశాఖ, అధికారులు పాల్గొని అటవీ అగ్ని ప్రమాదాల నియంత్రణపై మాక్ ఎక్స్ ర్ సైజ్ నమున ప్రదర్శను నిర్వహించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో విపత్తులు అగ్ని ప్రమాదాలు సంబవిస్తే ఎదురుకోవడానికి అధికార యంత్రాగం సిద్ధంగా ఉందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమములో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా**

**అదనపు కలెక్టర్, ఎం డెవిడ్.**



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 18(జనంసాక్షి ):** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యు ఎం డెవిడ్ అన్నారు . సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ,అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమములో వచ్చే ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గత ప్రజావాణిలో అందిన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దరఖాస్తు దారుల నుండి అర్జీలు స్వీకరించారు. ఆసిఫాబాద్ మండలంలోని రాహపల్లి గ్రామానికి చెందిన పిడుగు మొండయ్య తనకు సెంట్రింగ్ మేస్త్రి పనుల పరికరాల కొనుగోళ్ళు కొరకు పి ఎం జి పి రుణము ఇప్పించుట గురించి. రెబ్బెన మండలంలో ని గోలేటి కి చెందిన గుగులోత్ స్వప్న గోలేటి శివారులో ఉన్న సాగు భూమికి నీటి సౌకర్యం కల్పించడం కొరకు మోటారు పంపు మంజూరి దరఖాస్తు. కౌటాల మండల కేంద్రానికి చెందిన ఎలుములె జ్ఞానేశ్వర్ మొగడ్ ధగడ్ క్రాస్ రోడ్డ్ వద్ద డ్రైనేజి నిర్మించుట గురించి దరఖాస్తు లింగాపూర్ మండలంలోని మొతిపటార్ గ్రామానికి చెందిన జాదవ్ లలిత ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేదుకు అటవీ శాఖ అనుమతులు ఇప్పించుట గురించి దరఖాస్తు .రెబ్బెన మండలం నవేగం గ్రామనికి చెందిన కమటి శంకర్ తనకు దివ్యంగా పించన్ ఇప్పించుట గురించి దరఖాస్తు, రెబ్బెన మండలం గోలేటి చెందిన కట్ల రజిత తనకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరి గురించి దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ఎం డి జమిల్ హుస్సేన్ తనకు ఫ్రీడం ఫైటర్ సర్టిఫికేట్ మంజూరి గురించి దరఖాస్తు చేసుకున్నారు. జైనూర్ మండలం దబోలి గ్రామానికి చెందిన కొడప మిరభాయి తనకు రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తుచేసుకున్నారు.

# రుద్రారంలో బోర్ వెల్ ప్రారంభం

## మండల అధ్యక్షులు బడితల రాజయ్య



**మల్హర్, మే 18(జనంసాక్షి)** మండల పరది లోని రుద్రారం గ్రామం లోని గుండారం పోచమ్మ గుడి వద్ద నీటి సౌకర్యం కల్పించాలి అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకపోయినా కాంగ్రెస్ మండల అధ్యక్షులు బడితల రాజయ్య. వెంటనే స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు గుండారం పోచమ్మ గుడి వద్ద బోరు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మలహార్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బడితెల రాజయ్య, రుద్రారం సర్పంచ్ చంద్రగిరి సంపత్,ఉప సర్పంచ్ బడితల కుమారస్వామి, వార్డు సభ్యులు చంద్రగిరి అశోక్, గాద గట్టయ్య,టెక్కం రవళి, బుచ్చయ్య,మోత్కు సంధ్యారాణి, మహేష్, కొమ్మెర విజయలక్ష్మి స్వామి, గాధ రమేష్,జాడి అనసూర్య, సమ్మయ్య,జాడి రాజశేఖర్, భాస్కర్,అశోక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,వేముల చంద్రమోహన్,దుద్దిల్ల సత్యం, మాజీ వార్డ్ మెంబర్ సభావాత్ కిషన్ నాయక్, మూడేత్తుల రమేష్,బొంతల అశోక్, పాల్గొనడం జరిగింది.

# ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికతో పర్యాటక రంగానికి సరికొత్త కళ



**ములుగు ప్రతినిధి,మే 18(జనంసాక్షి).** 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్లో పర్యాటక శాఖకు సంబంధించిన బ్రోచర్, పోస్టర్ల ను ఆవిష్కరించారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వ సంపదను, పర్యాటక శోభను ప్రపంచానికి చాటిచెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా మే 18 నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తేదీ 20-05-2026 బుదవారం ములుగు మండలంలోని జాకారం శివాలయం వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీకి ఆదేశిస్తూ పలు సూచలనలు చేశారు. తేది 21-05-2026 గురువారం యూట్యూబర్స్ సోషల్ మీడియా, ఇన్ఫ్లుయెన్సర్స్ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలని జిల్లా పౌర సంబంధాల అధికారినీ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఏవో రాజ్ కుమార్, డిపిఆర్ఓ, జిల్లా స్పోర్ట్స్ అధికారి, టూరిజం శాఖ సిబ్బంది, గైడ్స్, టూరిస్ట్ పోలీస్, పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం



**చిట్యాల, మే 18( జనం సాక్షి):** మండల కేంద్రంలో సోమవారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అల్లకొండ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు , జిల్లా యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్ గారి ఆదేశానుసారం అతి తొందరలోనే మండల యూత్ కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు దిశగాఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.మండలంలోని అన్ని గ్రామశాఖ యూత్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రజాప్రభుత్వంలో ప్రజలకు అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి యూత్ కాంగ్రెస్ నాయకుడు కృషి చేసేలా చర్యలు తీసుకుంటామని ఈ సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బొమ్మ కిరణ్ గౌడ్, గోల్కొండ నాగరాజు, ఎలగొండ చిరంజీవి, తీగల నాగరాజు,గోపగాని శివ, చిట్యారి రాజు, నీలేష్, భద్రి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు కాలిన మొక్కజొన్నలు

## రూ. 2 లక్షల నష్టం



**చెన్నారావుపేట, మే 18( జనం సాక్షి):** మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన చింతకి ంది అజేందర్ రెండు ఎకరాల మొక్కజొన్నలను బస్తాల్లో నింపి వరంగల్ మార్కెట్ కు తీసుకువెళ్దామని సిద్ధం చేశాడు. సోమవారం గుర్తుతెలియని రైతు మొక్కజొన్న చొప్పకు నిప్పు పెట్టడంతో ప్రమాదవశాత్తు అజేందర్ కు చెందిన మొక్కజొన్నలు కాలి బూడిదయ్యాయి. చుట్టుపక్కల రైతులు చూసి మంటలు అర్పినప్పటికీ అప్పటికే నష్టం జరిగిందని రైతు అజేందర్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ప్రమాదంలో రూ. 2లక్షల నష్టం జరిగిందని తెల్లారితే వరంగల్ మార్కెట్ కు తీసుకెళ్దామని అనుకునే లోపే నష్టం జరిగిందని బాధిత రైతు ఆందోళన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం పంట నష్టపరిహారాన్ని అంచనా వేసి ఆదుకోవాలని బాధిత రైతు చింతకింది అజేందర్ ప్రభుత్వాన్ని కోరాడు.

# దళిత వర్గాలకే కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవి కేటాయించాలి

## దళిత కాంగ్రెస్ పార్టీ నాయకుల డిమాండ్



**బచ్చన్నపేట మే 18 ( జనం సాక్షి):** కాంగ్రెస్ పార్టీ బచ్చన్నపేట మండల అధ్యక్ష పదవి దళిత వర్గాలకే ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ దళిత ముఖ్య నాయకుల సమావేశని నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అధ్యక్ష పదవి దళితులకు ఇవ్వాలని జనగామ డిసిసి అధ్యక్షురాలు లక్కవత్ ధనవంతి, జిల్లా ఇన్చార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రితంల ను కలిసి వినతి పత్రం అందజేశామని దానికి సానుకూలంగా వారు స్పందించారని అన్నారు. మండలంలోనే దళితుల జనాభా ఎక్కువ ఉన్నదని కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం దళితులు అహర్నిశలు కృషి చేస్తారని అన్నారు. దళితులను పనులకే వాడుకోవడం తప్ప పదవులు ఇచ్చిన పాపన పోలేదని దళితులకు కాంగ్రెస్ పార్టీ పదవులు ఇచ్చి కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పడమటికేశపూర్ మాజీ సర్పంచ్ గిద్దెల రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల యువజన నాయకులు కళ్లెం రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బంధారం క్రాంతి కుమార్, టౌన్ ప్రధాన కార్యదర్శి కర్రె నరేష్, సీనియర్ నాయకులు అల్వాల్ రమేష్, మొద్దు బాల భాస్కర్, పాకాల చిరంజీవి, నర్సింగ ఎల్లేష్, బెజగం నరేష్, అల్వాల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఎన్నిక

## నియామక పత్రాలను అందజేసిన పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్



**రామకృష్ణాపూర్, మే 18(జనంసాక్షి):**కాంగ్రెస్ పార్టీ పట్టణ పూర్తిస్థాయి కమిటీని సోమవారం పట్టణ అధ్యక్షుడు వోడ్నాల శ్రీనివాస్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్నుకోబడిన ప్రతినిధులకు నియామక పత్రాలను అందజేశారు. ప్రధాన ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, స్పోక్ పర్సన్, కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, మీడియా కమ్యూనికేషన్, సోషల్ మీడియా కమిటీలను ఎన్నుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఎన్నుకోబడిన కార్యవర్గం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందు ఉండడంతో పాటు పార్టీ బలోపేతం, అలాగే రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రజాసేవ ధ్యేయంగా పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ అజీజ్, నాయకులు గాండ్ల సమ్మయ్య, నీలం శ్రీనివాస్, గౌడ్ మహిళా నాయకురాలు పుష్ప, దీప పాల్గొన్నారు.

# అటవీ అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహణ



**కాళేశ్వరం , మే 19అ, ( జనం సాక్షి)** జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది మరియు స్థానిక ప్రజలకు అడవుల్లో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణపై భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం లో సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించడానికి గల కారణాలు, వాటి వల్ల ప్రకృతి సంపద, వన్యప్రాణులు మరియు పర్యావరణానికి కలిగే నష్టాల గురించి వివరించారు. అలాగే అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేశారు .అదేవిధంగా అటవీ అగ్ని ప్రమాదాల సమయంలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మూడు ప్రాంతాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్స్ ద్వారా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు చేపట్టాల్సిన చర్యలు, అగ్ని నియంత్రణ పద్ధతులు, భద్రతా చర్యలు మరియు సత్వర స్పందనపై ప్రదర్శనలు నిర్వహిం చారు. అడవుల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఎండిన ఆకులు, గడ్డి లేదా చెత్తను కాల్చకుండా ఉండాలని, బీడీలు, సిగరెట్ ముక్కలు వంటి మండే వస్తువులను అడవుల్లో వేయకూడదని సూచించారు. అటవీ ప్రాంతాల్లో ఎక్కడైనా అగ్ని కనిపించిన వెంటనే సంబంధిత అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజల సహకారంతోనే అటవీ అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ ఎఫ్ డి ఓ సందీప్ , భూపాలపల్లి ఎఫ్ డి ఓ అప్పలకొండ , జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అబ్జర్వర్స్ ప్రవీణ్, ఎఫ్ ఆర్ ఓ లు రవి, ఇక్బాల్ , డివిజన్ సిబ్బంది, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పుష్కరాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ , ఎస్పీ



**కాళేశ్వరం , మే 19 , ( జనం సాక్షి)**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద మే 21 నుండి జూన్ 1 వరకు నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి సోమవారం పరిశీలించారు.
ఈ సందర్భంగా ప్రధాన ఘాట్‌ను పరిశీలించిన కలెక్టర్ భక్తుల సౌకర్యార్థం గోదావరి నదిలో క్వయర్ మ్యాట్ ఏర్పాటు చేయాలని, పారిశుధ్య పనులను వేగవంతం చేసి పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. భక్తులు సమాచారం తెలుసుకునేలా తగిన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం హెలిప్యాడ్‌ను పరిశీలించి, హెలిప్యాడ్ చుట్టూ బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం, నీరు చల్లడం, ప్రధాన ఘాట్ నుండి సరస్వతి ఘాట్ వరకు ఏర్పాటు చేసిన తాత్కాలిక రహదారిపై నిరంతరం నీటిని చల్లుతూ ఉండాలనిఆదేశించారు. అలాగేహెలిప్యాడ్ వద్ద పెయింటింగ్, రోడ్డు మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. తరువాత సరస్వతి ఘాట్‌ను పరిశీలించిన కలెక్టర్ భక్తులు బట్టలు మార్చుకునే గదులు, షవర్ ట్యాప్స్ వంటి సదుపాయాలను పరిశీలించారు. గోదావరి నదిలో నీటి మట్టాన్ని పరిశీలించి, భద్రతా చర్యలల్లో భక్తులు నదిలోకి వెళ్లకుండా ప్రతి 50 మీటర్లకు బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, గజ ఈతగాళ్లను నియమించాలని సూచించారు. ఘాట్ మెట్లపై వేసిన అచ్చుల డిజైన్లకు రంగులు వేయాలని, సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేస్తున్న సదుపాయాలను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే స్టాల్స్ ఏర్పాటు చేయుచున్న ప్రాంతాన్ని, టెంట్ సిటీ ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. మ్యూజియాన్ని పరిశీలించిన కలెక్టర్ సమయం తక్కువగా ఉన్నందున ముఖ్యమైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకుసూచించారు. ప్రతి విగ్రహం వద్ద పూర్తి సమాచారాన్ని ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డిఓ లు హరికృష్ణ, రవీందర్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పంచాయతి రాజ్, విద్యుత్తు, పంచాయతి రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతు సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ఎస్పి కేకాన్ సుధీర్ రామనాథ్ పర్యటన

- వడ్ల కొనుగోలు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి
- రైతులకు అండగా ములుగు జిల్లా పోలీసులు
- వడ్ల రవాణా,తూకం అక్రమాలపై చర్యలు తీసుకుంటాం
- రైతులకు న్యాయం జరిగేలా చర్యలు
- జిల్లా ఎస్పి కేకాన్ సుధీర్ రామనాథ్



**ములుగు బ్యూరో,మే18(జనం సాక్షి):-**ములుగు జిల్లా జంగాలపల్లి వడ్ల కల్లాన్ని జిల్లా ఎస్పి కేకాన్ సుధీర్ రామనాథ్ స్థానిక అధికారులైన ములుగు డిఎస్పి రవీందర్,స్థానిక సీఐ,ఎస్ఐ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.రైతులు మాట్లాడుతూ, వడ్లను రైస్ మిల్లులకు తరలించేందుకు సరిపడా రవాణా సదుపాయాలు లేక ఆలస్యం జరుగుతోందని,దీనివల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎస్పికి వివరించారు. అదేవిధంగా రైస్ మిల్లుల వద్ద కాంటా తూకంలో అధికంగా వడ్లు కట్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.రైతుల సమస్యలను విన్న ఎస్పి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రైతులకు తెలిపారు, రైతుల సమస్యల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ రైతులకు అన్ని సమయాలలో అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం అబ్బాపూర్‌లోని శ్రీ మాతా ఆగ్రో టెక్ పారా బాయిల్డ్ రైస్ మిల్లును ఎస్పి పరిశీలించారు. మిల్లులో వడ్ల నిల్వ, ప్రాసెసింగ్ విధానం,రోజుకు ఎంత మేర వడ్లు స్వీకరిస్తున్నారనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కాంటా తూకం యంత్రాన్ని, వడ్ల నాణ్యత తనిఖీ ప్రక్రియను పరిశీలించారు.రైతుల నుండి సాధ్యమైనంత ఎక్కువ వడ్లు పారదర్శకంగా కొనుగోలు చేయాలని,తూకం విషయంలో ఎలాంటి అక్రమాలు జరగకుండా చూడాలని రైస్ మిల్ యాజమాన్యానికి ఎస్పి ఆదేశించారు.తూకంలో తేడాలు గమనిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోగల వడ్ల కళాలను స్థానిక పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ రోజువారి ఎగుమతి పై నివేదిక ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు.

# ములుగు జిల్లాలో ప్రారంభమైన యువజన, క్రీడల వారోత్సవాలు

- **99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 6 రోజుల కార్యక్రమం**
- **యువజన క్రీడల శాఖ అధికారి బి.రామ్మోహన్**



**ములుగు ప్రతినిధి, మే 18(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, ములుగు జిల్లాలో ఈనెల 18 నుండి 23 వరకు యువజన మరియు క్రీడల వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బి రామ్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మే 18న జిల్లా, మండల స్థాయిలలో ఫిట్ ఇండియా యాక్టివ్ తెలంగాణ మారథాన్ అండ్ ఫిజికల్ లిటరసీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఉదయం 8:30 గంటలకు సంక్షేమ భవనం నుండి ప్రారంభమైన ఈ రన్‌కు క్రీడా సంఘాలు, విద్యార్థులు, కోచ్‌లు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. 18-05-2026 ఫిట్, యాక్టివ్ తెలంగాణ: మారథాన్, ఫిజికల్ లిటరసీ జిల్లా, మండల స్థాయి 19-05-2026 కెరీర్ & స్కిల్ డెవలప్‌మెంట్ డే – నైపుణ్యాల సాధికారత, ఉజ్వల భవిష్యత్తు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి 20-05-2026 యూత్ లీడర్‌షిప్ సమ్మిట్ – లక్ష్యంతో నడవండి, భవితకు స్ఫూర్తినివ్వండి జిల్లా స్థాయి 21-05-2026 ప్లే, పార్టిసిపేట్ – స్పోర్ట్స్ డే జిల్లా స్థాయి 22-05-2026 సెర్వ్, సపోర్ట్ – క్లీన్ తెలంగాణ కోసం యువత మండల, అసెంబ్లీ & జిల్లా స్థాయి 23-05-2026 ఉద్యోగ సాధన – ప్రతిభకు తగిన అవకాశాల కల్పన జిల్లా స్థాయి ములుగు జిల్లా లోని క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, యువతీ యువకులు, విద్యార్థులు ఈ ఆరు రోజుల పాటు జరిగే వివిధ కార్యక్రమాలలో అత్యధిక సంఖ్యలో పాల్గొని, ఈ యువజన క్రీడా వారోత్సవాలను విజయవంతం చేయవలసిందిగా జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఆ ప్రకటలో కోరారు.



## ఎల్కతుర్తిలో 2కే వాకథాన్

**ఎల్కతుర్తి (జనంసాక్షి) :** హన్మకొండ జిల్లా ఎలకతుర్తి మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా సోమవారం 2కే వాకథాన్ కార్యక్రమాన్ని యంపిడిఓ, మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యంపిడిఓ ఎన్.విజయ్ కుమార్ మాట్లాడుతూ నడక వలన ఆరోగ్యంగా, శారీరకంగా దృఢంగా ఉంటామని ప్రతి రోజు వేయి అడుగులు నడవాలని అన్నారు. యోగ సాధన చేయడం వలన శరీరం, మనసు, ఆత్మ అన్ని ఆరోగ్యాంగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్, లావణ్య పీ డి ఓ విజయ్ కుమార్ మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ, వ్యాయమ ఉపాధ్యాయులు శీలం అనిల్ కుమార్, యోగ గురువు వెంకన్నను సన్మానించిన సీఐ ఎస్సై ఎంపీడీవో తదితరులు పాల్గొనీ అభినందించారు.

## రేపు బంద్ నేపథ్యంలో వినతి పత్రం అందజేత

**చిట్యాల, మే 18( జనం సాక్షి):** మండల కేంద్రంలోని డ్రగ్గిస్ట్, కెమిస్ట్ మండల కమిటీ ఆధ్వర్యంలో తాసిల్దార్ వసంతరావు , సిఐ మల్లేష్ కి సోమవారం వినతి పత్రం అందజేసిన చిట్యాల మండల డ్రగ్స్ అండ్ కెమిస్ట్రీ కమిటీ మండల అధ్యక్షుడు గుర్రపు తిరుపతి గౌడ్, కార్యదర్శి చల్లగాని నాగరాజు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్లైన్లో డ్రగ్స్, నార్కోటిక్ డ్రగ్స్ అమ్మకాలను, సప్లైలను నిషేధించాలని జాతీయ స్థాయి బంద్ లో భాగంగా బుధవారం రోజు మెడికల్ షాపులన్నీ బంద్ ఉంటాయని తెలిపారు. మండలంలోని ప్రజలు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందు రోజే అవసరమైన మందులు తీసుకోవాలని కోరారు. ఈ బందుకు ప్రజలందరూ సహకరించాలని అన్నారు.



## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ట్రాక్టర్ దహనం



తాండూర్, మే 18( జనం సాక్షి) : మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం అచ్చలాపూర్ గ్రామంలో విద్యుత్ ప్రమాదం తో ఆదివారం ట్రాక్టర్ దహనం అయ్యింది. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన విద్యుత్ అధికారులను గ్రామస్థులు నిలదీశారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామంలో వేలాడే కరెంట్ తీగలు, వంగిన స్తంభాల కారణంగానే ప్రమాదం సంభవించిందని, పేద రైతు ట్రాక్టర్ దహనమైందని ఆరోపించారు. విద్యుత్ శాఖ ఏఈ జాన్, లైన్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్, జూనియర్ లైన్‌మెన్ మహదేవ్‌ను మూడు గంటల పాటు అడ్డగించి పరిహారం కోసం డిమాండ్ చేశారు. గ్రామంలో దాదాపుగా 15 దారుల్లో విద్యుత్ తీగలు వేలాడుతూ వాహనాలకు, ఎడ్ల బండ్లకు కూడా తాకే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు.మరమ్మతులు చేపట్టాలని కొన్ని నెలలుగా చెబుతున్నప్పటికీ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తాండూర్ ఎస్సై కే ప్రసాద్ అక్కడకు చేరుకుని అటు స్థానికులతో, ఇటు అధికారితో మాట్లాడారు. రెండు, మూడు నెలల్లో ట్రాక్టర్ యజమానికి పరిహారం ఇప్పించడానికి ప్రతిపాదనలు పంపిస్తామని డీఈఈ ఫోన్లో చెప్పడంతో స్థానికులు శాంతించారు.ఈ వర్షాకాలం ప్రారంభానికి ముందే గ్రామంలో విద్యుత్ లైన్ల పూర్తి స్థాయి మరమత్తులు పూర్తి చేసి ప్రమాధాలు జరగకుండా చూడాలని కోరారు. అచ్చలాపూర్ ఉప సర్పంచ్ గట్టు సంతోష్ కుమార్, నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, కొండ సాయి, మాజీ ఉప సర్పంచ్ అడువాల సత్యనారాయణ పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి 50 కిలోల బియ్యం పంపిణీ



**చెన్నారావుపేట, మే 18( జనం సాక్షి) :** మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయంగా కాంగ్రెస్ వరంగల్ జిల్లా కార్యదర్శి కంది కృష్ణ చైతన్య రెడ్డి సోమవారం బియ్యాన్ని పంపిణీ చేశారు. చెన్నారావుపేట గ్రామానికి చెందిన ఇల్ల రవి తల్లి ఇల్ల గౌరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కంది కృష్ణ చైతన్య రెడ్డి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు ఆమె నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి మనో ధైర్యం కల్పించారు.అలాగే కుటుంబానికి అండగా నిలుస్తూ 50 కిలోల బియ్యాన్ని ఆర్థిక సహాయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొంతి శ్రీనివాస్, వార్డ్ మెంబర్ లక్క రాజు, కుండె కట్టయ్య, కాంగ్రెస్ నాయకులు కంది రవి చైతన్య రెడ్డి, యు. రాజు, మరాటి రాజు, రంగారెడ్డి పాల్గొన్నారు.

## గిరిజన దర్బార్ లో సమర్పించిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కరించాలి

**ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వాత్సల్ టోప్పో**



**ఏటూరునాగారం, మే 18(జనంసాక్షి).:** సోమవారంఐ ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో గిరిజనుల నుండి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించి సమస్యలను త్వరీతగతిన పరిష్కారం చూపాలని సంబంధిత సెక్టార్ అధికారులకి ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశించినారు. ఈ గిరిజన దర్బార్ లో వివిధ మండలాల నుండి వచ్చిన గిరిజనులు (45) దరఖాస్తులు ప్రాజెక్టు అధికారి ఐటిడిఏ ఏటూరునాగారం కి స్వయంగా గిరిజనులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కె నాగోరావు అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి (జి) ఐటిడిఏ, డి జనార్దన్ డిప్యూటి డైరెక్టర్ ఐటిడిఏ, వీరబద్రం ఈఈ టి డబ్ల్యూ ఐటిడిఏ, ఎ రాజ్ కుమార్ పరిపాలన అధికారి ఐటిడిఏ, ఏ అనిల్ కుమార్ డిప్యూటి తహసిల్దార్ (ఎస్డీసి) ఐటిడిఏ, కె క్రాంతి కుమార్ డిప్యూటీ డిఎంహెచ్వో ఐటిడిఏ, కె ప్రభాకర్ పేసా కో ఆర్డినేటర్ ఐటిడిఏ, ఏ కిషోర్ జియాలజిస్ట్ ఐటిడిఏ, ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రిన్సిపాల్ ఆర్ఐటిఐ, ఏమ్ కొండల రావు జెడిఎమ్ ఐటిడిఏ, ఎల్ శంకర్ టిఎస్ ఆర్టీసి మేనేజర్ అధికారులు గ్రీవెన్స్ సెల్ లో పాల్గొన్నారు.

## ప్రకృతి విపత్తులపై అప్రమత్తత

శాఖల మధ్య సమన్వయం, ప్రజల తరలింపు, సహాయక చర్యలు ఎలా ఉండాలనే అంశాలను ఈ మాక్ డ్రిల్ ద్వారా స్పష్టంగా ప్రజలు గమనించారు. వరద బాధితులకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి భోజన ప్యాకెట్లు తాగునీటిని అందించారు. కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రతి నిమిషం కీలకమని, అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అడెల్లి బుచ్చయ్య ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి వారి మౌలిక సదుపాయాలు ఆరోగ్య క్యాంప్ లు ఏర్పాటు చేసిన తీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వరంగల్ ఆర్డీవో సుమ, జడ్పీ సీఈవోరామ్‌రెడ్డి,డీఎంహెచ్‌వోసాంబశివరావుతో,అగ్నిమాపక అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు లతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి అవాంతరాలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, సహకార అధికారి వాలియా నాయక్, సివిల్ సప్లైస్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోలేటి ఎక్స్‌రోడ్డులో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని కోరుతూ వినతి



**రెబ్బెన, మే18 (జనం సాక్షి):** రెబ్బెన మండలంలోని గోలేటి టౌన్‌షిప్ ప్రాంత ప్రజలు, సింగరేణి కార్మికుల రవాణా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నాయకులు ఆసిఫాబాద్ బస్ డిపో మేనేజర్‌కు మెమోరాండం సమర్పించారు. గోలేటి ఎక్స్‌రోడ్డులో అన్ని ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి రోజు వందలాది మంది ప్రయాణికులు మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ ప్రాంతాలకు ప్రయాణిస్తుండగా, సింగరేణి కార్మికులు గోలేటి, సీహెచ్‌పీ, ఖైరగూడ ఓసీపీ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 5 గంటలకు మంచిర్యాల నుంచి బెల్లంపల్లి, రెబ్బెన, ఆసిఫాబాద్ మీదుగా ఆదిలాబాద్ వరకు కొత్త ఎక్స్‌ప్రెస్ సర్వీసును ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే బెల్లంపల్లి వరకు నడుస్తున్న కొత్తగూడెం డిపో సూపర్ లగ్జరీ బస్సును ఆసిఫాబాద్ వరకు పొడిగించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డిపో మేనేజర్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రెబ్బెన మండల అధ్యక్షుడు మల్రాజ్ రాంబాబు, ఉపాధ్యక్షులు దుర్గం శ్రీధర్, విష్ణు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాలు తనిఖీ....



**నూగూర్ వెంకటాపురం మే 18(జనం సాక్షి) :** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో సోమవారం వెంకటాపురం పట్టణ కేంద్రం లో శివాలయం వద్ద సాయంత్రం ఎస్సై తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. వాహనదారులందరు నంబర్ ప్లేట్, సరైన ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని చూచించారు. ఈకార్యక్రమంలో సీఆర్పీఫ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.